రేపు పశుమర్తి శతజయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రముఖ సాహితీవేత్త పశుమర్తి రామారావు శతజయంతి వేడుకలను ఈనెల 3న నగరంలోని బ్లూఎర్త్ హోటల్‌లో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు రాంమనోహర్, రాజేష్ ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో ప్రముఖ నేత్ర వైద్యులు ఎం.వి.రమణారావు, కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు విజికె మూర్తి, సీనియర్ జర్నలిస్టు జంధ్యాల శరత్‌బాబు, వాండ్రంగి కొండలరావు హాజరు కానున్నట్టు తెలిపారు. ఈ వేడుకల్లో సాహితీ వేత్తలు, పశుమర్తి అభిమానులు హాజరు కావాలని కోరారు.

మూలపేటలో పారిశ్రామిక కారిడార్

- జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తాం
- కొబ్బరి పార్కును ఏర్పాటు చేస్తాం
- టెక్కలి, పలాస మధ్యలో విమానాశ్రయం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఈదుపురానికి పలు వరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి / ఇచ్ఛాపురం / కంచిలి

సంతబొమ్మాళి మండలం మూలపేటలో పది వేల ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. గత ప్రభుత్వం భావనపాడు పోర్టు పేరును మార్చి, మూలపేటకు తీసుకొచ్చిందని, అభివృద్ధి ఆగకూడదని దాన్ని కొనసాగిస్తున్నామన్నారు. టెక్కలి, పలాస మధ్యలో అనువైన స్థలాన్ని ఎంపిక చేసి ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాకు పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఎంతమంది యువతకు ఉపాధి కల్పిస్తే, పరిశ్రమలకు అంతగా ప్రోత్సాహకాలను కల్పిస్తామని పారిశ్రామికవేత్తలకు చెప్పినట్లు తెలిపారు. దీపం పథకాన్ని తానే ప్రారంభించానని, మహిళలకు ఖర్చులు తగ్గించేందుకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. దేశంలోనే తొలిసారిగా 1.55 కోట్ల మంది లబ్ధిదారులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో కొబ్బరి పార్కు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ప్రతి కుటుంబం నుంచి ఒక ఎంటర్‌ప్రైమర్‌ను తయారు చేస్తామని, అందులో 50 శాతం మహిళలకే ఇస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో ఏడాదికి రూ.250 చొప్పున ఫించన్‌ను పెంచితే తాము ఒకేసారి రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలు చేశామన్నారు. దేశంలోనే అత్యధిక మందికి ఫించన్ అందిస్తుంది కూటమి ప్రభుత్వం మాత్రమే అన్నారు. ఫించన్‌ను ఇంటింటికి వెళ్లి అందించాలని, కార్యాలయాల దగ్గర ఇస్తే ఊరుకునేది లేదన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ఎన్నడూ చూడని విధ్వంసం చూశామన్నారు. ఏ శాఖ తీరును సమీక్షించినా, విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయన్నారు. ప్రభుత్వ శాఖలను, వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. మెగా డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయుల పోస్టులను డిసెంబరు నుంచి భర్తీ చేస్తామన్నారు. మత్స్యకారులకు సంబంధించి 217 జిఒను రద్దు చేశామన్నారు. మద్యం షాపుల్లో గీత కార్మికులకు పది శాతం కేటాయించామన్నారు. రోడ్లను గుంతలు పూడ్చేందుకు రూ.886 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. గతంలో నీరు-చెట్టు, ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టిన అందరికీ డబ్బులు చెల్లిస్తామన్నారు. పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో రాష్ట్రాన్ని నాశనం చేసిందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. ఉద్దానంలో కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉందన్నారు. వెనుకబడిన జిల్లాగా ఉన్న శ్రీకాకుళానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చేలా చూస్తామన్నారు. వంశధార, బాహుదా నదులను అనుసంధానం చేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని చెప్పారు. జీడి, కొబ్బరి రైతులకు ఆదాయం పెరిగేలా చర్యలు చేపట్టాలని, బోర్డులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఉచిత సిలిండర్ల పథకంలో లోటుపాట్లను సమీక్షించి పథకాన్ని పటిష్ఠంగా అమలు చేస్తామని చెప్పారు. ఉత్తరాంధ్రలో వలసలు లేకుండా పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉపాధి కల్పిస్తామన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 2014-19 కాలంలో టిడిపి ప్రభుత్వం తీసుకొచ్చిన వంశధార-బాహుదా నదుల అనుసంధాన్ని వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని, దాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు.

జెండా ఊపి గ్యాస్ సిలిండర్ల వాహనాన్ని ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు



ఈదుపురానికి పలు వరాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈదుపురం గ్రామంపై వరాల జల్లు కురిపించారు. బాహుదా నదిపై రూ.30 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మాణం, ఇచ్ఛాపురంలో నిరుపేదలైన 95 మందికి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఐదేళ్లలో ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తామన్నారు. 70 మందికి మరుగుదొడ్లు, 90 మందికి బోర్‌వెల్స్ మంజూరు చేయనున్నామన్నారు. గ్రామంలో అర్హులైన నిరుపేదలకు ఫించన్లు, రేషన్‌కార్డులు అందిస్తామన్నారు. గ్రామ అవసరాలను తెలుసుకునేందుకు కలెక్టర్‌ను పంపిస్తామన్నారు. బెంతు ఒరియాల సమస్యపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. తక్షణమే స్థిర నివాసం సర్టిఫికేట్ల జారీకి చర్యలు చేపడతామని చెప్పారు.

సభలో పాల్గొన్న ప్రజలు

పలువురికి ఆర్థికసాయం

పర్యటనలో భాగంగా పలువురికి ముఖ్యమంత్రి స్వయంగా ఆర్థికసాయాన్ని అందించారు. తన తల్లి కేన్సర్‌తో బాధపడుతోందని, హెల్ప్ మి అంటూ జలుమూరుకి చెందిన సాయికుమార్ సభలో ప్లకార్డును ప్రదర్శించాడు. స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే ఆయన్ను పిలిచి సమస్యను అడిగి తెలుసుకున్నారు. రూ.రెండు లక్షల ఆర్థికసాయం అందిస్తూ ఆదేశాలు జారీ చేశారు. పింఛను అందించేందుకు ఒంటరి మహిళ బలిజాపల్లి జానకి ఇంటికి వెళ్లిన ముఖ్యమంత్రి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తనకు, తన తండ్రికి ఆరోగ్యం బాగోలేదంటూ ఆమె చెప్పడంతో రూ.రెండు లక్షలు మంజూరు చేశారు. ఆమెకు గృహం లేదని చెప్పగా తక్షణమే నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

కష్టపడిన వారికి సముచిత గౌరవం

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కష్టపడిన వారికి సముచిత గౌరవం లభిస్తుందని టిడిపి జాతీయ అధ్యక్షుడు, సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ అరాచక పాలనలో నాయకుల మొదలు కార్యకర్తల వరకు అందరూ ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ఇసుక, మద్యం విషయంలో ప్రభుత్వ ప్రతిష్టకు భంగం లేకుండా ప్రతి నాయకుడు, కార్యకర్త నడుచుకోవాలన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో సిఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణాన్ని పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీ పడొద్దని పలు సూచనలు చేశారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

దీపం-2 పథకం ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి మహేశ్వర్ రెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, కూన రవికుమార్, గౌతు శిరీష, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, ఎన్.ఈశ్వరరావు, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, ఆర్‌డిఒ కృష్ణమూర్తి తదితరులు హెలీప్యాడ్ వద్దకు వచ్చి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

వేతన బకాయిలు చెల్లించాలి

రిమ్స్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రిమ్స్ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సెక్యూరిటీగార్డులు, పారిశుధ్య సిబ్బంది, ఇతర అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిఐటియు ఆఫీసు బేరర్ మురళి, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై రిమ్స్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు ప్రతి నెలా ఐదో తేదీ లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండేళ్లుగా వేతనాలు క్రమపద్ధతిలో నెలవారీ చెల్లించకుండా మూడు, నాలుగు నెలలకోసారి చెల్లిస్తున్నారని, దీనివల్ల కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, నిత్యావసర సరుకులు సైతం మార్కెట్‌లో కొనలేని పరిస్థితి ఉందన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం వల్ల తప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో పెరుగుతున్న ధరల భారాన్ని మోయలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రైవేటు, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల తరహాలో వేతనాలైనా చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం 549 జిఒ ప్రకారం రూ.16 వేలు వేతనం ఇవ్వాలని నిర్ణయించిందని చెప్పారు. ఆ ఒప్పందంలో ప్రభుత్వం కార్మికుని ఇఎస్ఐ, పిఎఫ్ వాటాను, కాంట్రాక్టర్ వాటాను వేతనంలో మినహాయించాలని మెలికపెట్టి ద్రోహం చేసిందన్నారు. గత ప్రభుత్వం కార్మికులను ఆప్కాస్ పరిధిలో చేరుస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సైతం అమలు చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన శిబిరాన్ని సందర్శించిన ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దాసరి షకీలా కాంట్రాక్టర్‌తో మాట్లాడి సిబ్బందికి వేతనాలు చెల్లిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.గోవర్ధనరావు, రిమ్స్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మామిడి సూర్యనారాయణ, కోశాధికారి ఆర్.చిన్నారావు, కె.రవి, సావిత్రి, కృష్ణవేణి, కుమారి, సంతోషి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

జాతీయ లోక్ అదాలత్‌ను డిసెంబరు 14వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా వెల్లడించారు. జిల్లా కోర్టుతో పాటు ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, కొత్తూరు, పొందూరు, పాలకొండ, రాజాం కోర్టుల్లో ఆరోజున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కోర్టు భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పని భారం తగ్గించుకోవాలన్నారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, బ్యాంకు సంబంధించిన కేసులను జాతీయ లోక్ ఆదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇన్సూరెన్స్ అధికారులు ఎక్కువ సంఖ్యలో మోటారు వాహన ప్రమాద కేసులను రాజీ చేయడం ద్వారా ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందే అవకాశం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందని తెలిపారు.

లగేజీ వ్యాను బోల్తా

16 మంది కూలీలకు గాయాలు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లాం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం లగేజీ వ్యాన్ బోల్తా పడిన ప్రమాదంలో 16 మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. బారువ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పి.పి శాసనం గ్రామానికి చెందిన 16 మంది కూలీలు లగేజీ వ్యాన్‌లో బారువలో సిసి రోడ్డు నిర్మాణం పనికి కోసం వెళ్తున్నారు. కొర్లాం సబ్ స్టేషన్ వద్ద వ్యాన్ టైర్ పంచరు కావడంతో ఒక్కసారిగా వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శాసనంకు చెందిన ఎం.రుక్మిణి, రబ్బి బెహరా, కైలాస్ బెహరా, ఎం.కృష్ణమ్మ, తిలోత్తమ బెహరా, ఎం.గాయత్రి, ఎం.దమయంతి, శకుంతల బెహరా, రాజు బెహరా, రాజేశ్వరి బెహరా, మీనాకుమారి కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. అందరూ భయాందోళనకు గురై కేకలు వేశారు. దీంతో ఆ ప్రాంతమంతా బయానకంగా మారింది. సమాచారం తెలుసుకున్న శాసనం సర్పంచ్ వేణు, బి.ఆర్.సి.పురం సర్పంచ్ బుద్ధాన శ్రీకృష్ణ, యువకులు వెంటనే సంఘటన స్థలాన్ని చేరుకొని క్షతగాత్రులను బారువ ఆస్పత్రికి తరలించారు. అందులో పది మందికి ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి రాగోలు జెమ్స్‌కు తరలించారు. సంఘటనపై బారువ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోల్తా పడిన వాహనం

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కూటమి నాయకుల కుమ్ములాట

పింఛన్ల పంపిణీలో కార్యదర్శిని నిలదీత

కార్యదర్శిని నిలదీస్తున్న కూటమి నాయకులు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బుడుమూరులోని కూటమిలో కుమ్ములాటలు, గ్రూపులతో నడిరోడ్డుపై గొడవలతో వీధినపడ్డారు. దీంతో రెండు గ్రూపులకు చెందిన నాయకులు పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడుని రోడ్డుపై నిలదీశారు. శుక్రవారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. బుడుమూరులో ఏడుగురికి పింఛన్ల పంపిణీలో లబ్ధిదారుల పేర్లను ముందుగా ఎంపిక చేశారు. వారి ఇళ్లకు ఎంపీ, ఎమ్మెల్యేను తీసుకెళ్లి పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఆ పేర్ల జాబితా కార్యదర్శికి ఇచ్చారు. గ్రామంలోని కూటమి నాయకులు, మండల స్థాయి అధికారులు ఆ ఇళ్లకు వెళ్లే దగ్గర ఎంపీ, ఎమ్మెల్యేలకు స్వాగతం పలకడానికి అంతా ఎదురుచూస్తున్నారు. దానికంటే ముందు కూటమి నాయకుడు, మాజీ సర్పంచ్ పెదనాయనా శ్రీరాములునాయుడు తన గ్రూపు నాయకులతో తన సానుభూతిపరుల ఇంటికి తీసుకెళ్లి పింఛన్ల నగదు అందజేశారు. దీంతో ఎంపిటిసి మాజీ సభ్యులు పండి గోపాలరావు, నెల్లి లక్ష్మంనాయుడు, జనసేన నాయకులు వి.శివ, సూర్యారావు, ఆర్.రాంబాబు తదితరుల వద్దకు ఎంపీ, ఎమ్మెల్యేలు వచ్చారు. అక్కడే పింఛనుదారులు పింఛను ఇచ్చి వెళ్లిపోయారు. అనంతరం ఈ గ్రూపునకు చెందిన వారు కార్యదర్శి అప్పలనాయుడును నిలదీశారు మేము ముందుగా ఇచ్చి పేర్లు ప్రకారం ఇవ్వకుండా... వైసిపి మద్దతుదారుల ఇంటికి ఎంపీ, ఎమ్మెల్యేలను తీసుకెళ్లి పింఛన్లు ఎలా అందజేస్తారని నిలదీశారు. ఇంతలో ఇరు గ్రూపులకు చెందిన నాయకులు గట్టిగా కేకలు వేశారు. ఒక వరలో రెండు కత్తులు నప్పవు... కానీ, కూటమిలో మూడు పార్టీలు ముప్పై మూడు గ్రూపులతో బాధలు పడలేక కిందిస్థాయి నాయకులకు, అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. భవిష్యత్‌లో ఎటు దారితీస్తుందో వేచిచూడాలి.

బహిరంగ నోటీసు

మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి (యస్.సి. అండ్ యస్.టి) వారి కోర్టు, శ్రీకాకుళం

ఐ.ఎ.274/2024 ఓ.ఎస్.50/2021

1) మద్రాపు లీలా మోహన్
2) భవిరిపూడి శ్రీరామమూర్తి నాయుడు

.......పిటీషనర్లు/వాదులు

మరియు :

రెడ్డి అప్పల నాయుడు వగైరాలు

.......రెస్పాండెంట్లు/ప్రతివాదులు

2వ ప్రతివాది :

రెడ్డి పద్మావతి, వయస్సు 65 సం॥లు, భర్త అప్పలనాయుడు, నివాసము : డోరు నెం.3-5, పానిగూటివలస గ్రామం, రాజాం నగర పంచాయితీ, సంత కవిటి మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో వాదులు అయిన మద్రాపు లీలామోహన్ వగైరా మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి (యస్.సి. అండ్ యస్.టి) వారి కోర్టు, శ్రీకాకుళంలో దాఖలు చేసిన దావా ఓ.యస్. నెం.50/2021 నెంబరు దావాలో మీరు 2వ ప్రతివాదియై ఉన్నారు. సదరు దావాలో నోటీసులు జారీ కాబడినప్పటికి మీరు నేటి వరకు హాజరు కానందున పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయంపించి యున్నారు. మీ భర్త గారు అనగా 1వ ప్రతివాది ఈ దరిమిలా కాలము చేసినందున మీ భర్త గారి వారసులను చేర్పించుటకు వేసిన పిటిషన్‌లో కూడా పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయంపించి యున్నారు. సదరు దావా **తే.25.11.2024** నాటికి వాయిదా అయి ఉన్నది. కావున పైన పేర్కొన్న దావాలోనున్నూ, అందలి వారసులును చేర్చమని దాఖలైన పిటిషన్‌లో మీకు వాదన ఉన్న యెడల మీ వ్రాతమూలక స్టేట్‌మెంట్ వగైరాలు ఉన్న యెడల వాటితో సహా పై వాయిదా తేదీన, సదరు కోర్టులో వ్యక్తిగతముగా గాని లేదా తమ న్యాయవాది ద్వారా గాని హాజరై తమ వాదన మరియు లిఖితములను దాఖలు జేయవలసినదిగా మహారాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. పై చెప్పబడిన తేదిన హాజరు కాకుండ తప్పి పోయే యెడల మీ పరోక్షమందు పై వాద్యమును విమర్శ చేసి మహారాజశ్రీ కోర్టు వారు తీర్మానించడమగునని కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ఎమ్. బెనర్జీ, ఏడ్వోకేట్,
బొబ్బిలి, విజయనగరం జిల్లా.
సెల్ నెం. 9440592366

విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర మాజీ హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నుంచి వారం రోజుల పాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆధ్వర్యాన అవగాహనా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు విజిలెన్స్ ఎస్‌పి బి.ప్రసాదరావు తెలిపారు. విజిలెన్స్ కార్యాలయంలో వారోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించి సిబ్బందితో సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాపర్టీ అన్న నినాదంతో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి సమగ్రతా సంస్కృతిని ప్రజలు పెంపొందించుకోవాలని, అవినీతి రహిత సమాజాన్ని తయారు చేసుకునేందుకు దేశాభివృద్ధిలో భాగసామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాణం చేయిస్తున్న విజిలెన్స్ ఎస్‌పి ప్రసాదరావు


ఎమ్మెల్యే శిరీషతో టిడిపి ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యే నివాసానికి ప్రముఖులు

ప్రజాశక్తి- పలాస

ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం విచ్చేశారు. అక్కడకు వెళ్తున్న కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కె.శ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్, బొగ్గు రమణమూర్తి శిరీష స్వగృహానికి విచ్చేశారు. కార్యక్రమంలో ఆమె భర్త, నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి తదితరులు ఉన్నారు.

ఉత్తమ వైద్యాధికారిగా టెక్కలి మహిళ

ప్రజాశక్తి- టెక్కలి

అవార్డు అందుకుంటున్న అనూష

కర్ణాటక రాష్ట్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న టెక్కలికి చెందిన డాక్టర్ గజవిల్లి అనూషకి అరుదైన గౌరవం దక్కింది. కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఏటా అందజేస్తున్న ఉత్తమ వైద్యుల అవార్డుల ప్రదానోత్సవం భాగంగా శుక్రవారం కర్ణాటక విజయనగర్ జిల్లా ఆస్పత్రిలో ఆ రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ ఆమెకు అవార్డును అందజేశారు. మూడేళ్లుగా ఉత్తమ డాక్టర్‌గా ఎంపిక కావడం విశేషం. అలాగే ఆమె పనిచేస్తున్న ఆస్పత్రి కూడా ఉత్తమ ఏరియా ఆస్పత్రిగా ఎంపిక కావడం కావడంతో అక్కడి మంత్రి అభినందించారు. అనుషకు టెక్కలి సొండికుల సంక్షేమ సంఘం నాయకులు అభినందించారు.

పాడి రైతులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పాడి రైతులకు టిడిపి ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా ప్రోత్సాహంచి అందుకుంటుందని టిడిపి మండల మహిళా అధ్యక్షులు మెండ దమయంతి అన్నారు. మండలంలోని భగవాన్‌పురంలో పాల సేకరణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మందికి జీవనోపాధిగా పాడి పెంపకంపై, పాలు దిగుబడి అంశాలపై పశుసంవర్ధకశాఖ అధికారులు సూచనలు చేశారు.

సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ ఉద్యోగి తన విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం అన్నారు. కాశీబుగ్గ పరిధిలోని సూదికొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గున్న మధుసూదనరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మధుసూదనరావు దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ప్రేంచంద్, విద్యా కమిటీ చైర్మన్ పైల తులసి, ప్రధానోపాధ్యాయురాలు గోరు రేణుక, ఉపాధ్యాయులు పద్మకుమారి, హేమలత, సంధ్య, నవ్య, ఆశాలత, మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి ఇందిరాగాంధీ

నివాళ్లర్పిస్తున్న సత్యవతి

ఆమదాలవలస: పేదల పెన్నిధి స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అని మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. గురువారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గేటు సెంటర్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గరిబీ హఠావో నినాదంతో దేశంలోని పేదల ఆకలి తీర్చిన ఘనత స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీకే దక్కుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం ఆమె చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపిపి బొడ్డేపల్లి గోవింద్ గోపాల్, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముకరావు, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, పైడి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అలాగే కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అప్పారావు, శ్రీను, నాయుడు, రాజశేఖర్, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ బెల్‌ను అందజేస్తున్న సభ్యులు

ఎలక్ట్రానిక్ బెల్ వితరణ

వజ్రపుకొత్తూరు: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలు సందర్భంగా శుక్రవారం ప్రేరణ యూత్ అసోసియేషన్ డోకులపాడు ఉన్నత పాఠశాలకు ఎలక్ట్రానిక్ బెల్ వితరణగా అందించారు. సర్పంచ్ వడ్డీ సరితా కరుణాకర్, ఎంపిటిసి కొయిరి భాగ్యలక్ష్మి, ఢిల్లేశ్వరరావు సమక్షంలో శుక్రవారం అందజేశారు. మత్స్యకార సంఘ అధ్యక్షులు యంపల్ల పాపారావు, ఎంపిటిసి మాజీ సభ్యులు గండుపెల్లి పోలయ్య, ప్రేరణ యూత్ సభ్యులు పాల్గొన్నారు. పాఠశాలకు ఎలక్ట్రానిక్ బెల్ అందించి నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వరలక్ష్మి, ఉపా ధ్యాయ సిబ్బంది ప్రేరణ యూత్ అసోసియేషన్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.

వ్యర్థాలతో అనర్థం

బూర్జ: వ్యర్థాలతో అనర్థాలకు దారి తీస్తున్నాయి. పాలకొండ–శ్రీకాకుళం ప్రధాన రహదారికి అనుకుని ఉన్న గ్రామాల వద్ద రోడ్డుకి ఇరువైపులా వ్యర్థాలను వేస్తున్నారు. అంతే కాకుండా వాటిని తగలబెట్టడంతో కలుషిత పొగ వాహనదారులకు తీవ్ర తలనొప్పిగా మారింది. రాత్రి సమయాల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభ విస్తున్నాయని వాహనదారులు తెలిపారు. ఈ పొగను పీల్చడం వలన తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా సంబం ధిత అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టి రోడ్డు పక్కన వ్యర్థాలను తగలబెట్టకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన వ్యర్థాలకు పెట్టిన మంట

ధాన్యంలో దళారులదే రాజ్యం

గత ప్రభుత్వం రైతన్నలను నిండా ముంచింది. అధికారంలోకి వస్తే రైతన్నలను అన్ని విధాలుగా ఆదు కుంటాం. రైతు భరోసాను పెంచి అందిస్తామని ఎన్నికల ముందు ప్రకటనలు గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కని పించడం లేదు. దీంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి.

- పెట్టుబడులు రాని వైనం
- పట్టించుకోని ప్రభుత్వం
- లబోదిబోమంటున్న రైతాంగం

కాకినాడ తరలించేందుకు సిద్ధం చేస్తున్న ధాన్యం బస్తాలు

ప్రజాశక్తి- బూర్జ

రేయనక, పగలనక కష్టపడి పంటలను పండించిన రైతులకు తాము పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగిరాని పరిస్థితులు ఉన్నాయి. అయితే వ్యవసాయమే తప్ప మరో పని తెలియని రైతన్నలు తమకు అండగా ప్రభుత్వ సాయం అందిస్తుందని కొండంత ఆశలతో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటలు పండించిన రైతులకు భయం పట్టుకుంది. ఇంటిల్లిపాది కష్టపడి పండించిన పంటలు వరుణుడి బారిన పడకుండా ప్రస్తుతం నష్టాలకు కూడా ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పంటలకు బీమా సదుపాయం లేదని వాపోతున్నారు.

పొలం నుంచి ట్రాక్టర్‌తో రోడ్డుకు తరలిస్తున్న ధాన్యం

అప్పులతో అవస్థలు

పంటలు పండించేందుకు చేసిన అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నామని రైతులు పేర్కొన్నారు. పనులు ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు ఎకరా సాగు కోసం దుక్కులకు, విత్తనాలు పోసేందుకు, గట్లు వేయడం, దమ్ములు, ఆకుతీత, ఉడుపులు, ఎరువులు, గాబుతీత, కోతలతో పాటు నూర్పులకు ఎకరాకు సుమారు రూ.40 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. నాగావళి నది తీరం సమీపంలో ఉన్న తమ గ్రామాలకు సాగునీరు అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతులు ఆరోపించారు. దీంతో అవసరమైన సాగు నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని, అయితే ప్రస్తుతం తాము చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక 82 కేజీల ధాన్యాన్ని రూ.1400కు విక్రయిస్తున్నామని తెలిపారు.

అందని ప్రభుత్వ సాయం

గత ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పేరుతో ఆర్థిక సహాయాన్ని అందజేసేదని, అంతే కాకుండా వ్యవసాయ పనిముట్లు, విత్తనాలను అందజేసే వారిన్నారు. ఈ ప్రభుత్వంలో ఇంత వరకు రైతులకు ఎటువంటి సాయం అందించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా సాయం కింద రూ.20 వేలు వరకు అందజేస్తామన్న ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని రైతులు విమర్శకు గుప్పిస్తున్నారు.

కానరాని కొనుగోలు కేంద్రాలు

రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, అందుకోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని రైతులు పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తారా అన్న అనుమానం తమకు కలుగుతుందని రైతులు తెలిపారు. ముఖ్యంగా రైతులు పడుతున్న కష్టాలను కనీసం అధికారులు కూడా పట్టించుకోవడంలేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని, అలాగే ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు.

పెట్టుబడులూ రావడం లేదు

ఇంటిల్లిపాదీ కష్టపడి పండించిన పంటలకు తగిన ధర పలకడం లేదు. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉంది. కష్టం వృధా అయ్యింది. ప్రభుత్వ సాయం ఇంతవరకు అందించ లేదు

- భవిరి కృష్ణ, రైతు, బూర్జ

రైతుల కష్టం పాలకులకు పట్టదా..

రైతులు పడుతున్న కష్టాలు పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ సాయం రైతులకు అందజేస్తామని ఇంతవరకు అందజేయలేదు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో నష్టాలకు ధాన్యాలను విక్రయిస్తున్నాం. అధికారులు, పాలకవర్గం స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

- గంగుల రామ్మూర్తి, రైతు, బూర్జ

రైతుల ఇష్టంతోనే విక్రయాలు

రైతులు ఇష్టంతోనే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వ ఆదేశాలు ఇంకా రాలేదు. కొనుగోలు కేంద్రాలకు సంబంధించి సిబ్బందికి నియమించాల్సి ఉంది.

- ఎన్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి, బూర్జ

నేడు ఎర్రన్నాయుడు వర్ధంతి

ఎర్రన్నాయుడు (ఫైల్)

కోటబొమ్మాళి: కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 12వ వర్ధంతి తన స్వగ్రామం మండలం నిమ్మాడలో ఘనంగా నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలలు వేస్తామన్నారు. అనంతరం ఎర్రన్నాయుడు ఘాటు వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, నేతలతో నివాళ్లర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి నియోజక వర్గంలో నాలుగు మండలాల కార్యకర్తలు నాయకులు, ప్రజలు, జిల్లాకు చెందిన ముఖ్యనేతలు వారివారి గ్రామాల్లో ఉన్న ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూల మాలలు వేసి నిమ్మాడ చేరుకోవాలని పిలుపు నిచ్చారు.

మహాసభలను విజయవంతం చేయాలి

వజ్రపుకొత్తూరు : ఈనెల 9,10 తేదీల్లో పలాసలో నిర్వహించనున్న సిపిఎం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు వజ్రపుకొత్తూరులో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సిపిఎం కార్మిక, కర్షక, ప్రజల మౌలిక సమస్యలపై నిరంతరం పోరాడుతుందని అన్నారు. ప్రజా ధనం తో నిర్మించుకున్న ప్రభుత్వ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. ఈయనతో పాటు టి.భాస్కరరావు, ఎన్.మోహనరావు, ఎన్.చంద్రయ్య, బి.రామకృష్ణ ఉన్నారు.

వసతిగృహంలో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రంలోని బిసి బాలికల వసతిగృహంలో వార్డెన్ పైడి పద్మావతి ఆధ్వర్యంలో దీపావళి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది రకాల పిండి వంటలు చేశారు. అలాగే విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తులను ధరించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

దీపావళి సందర్భంగా చేసిన పిండి వంటలతో విద్యార్థినులు

పలాస అభివృద్ధికి కృషి చేయాలి

పలాస: పలాస అభివృద్ధికి కృషి చేయాలని సిఎం చంద్రబాబును ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి జీడి పప్పు బొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం పలాస నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని విన్నవించారు.

పలాస : వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

వినతిపత్రం అందజేశారు. రైతులు రెండు పంటలు పండించుకునేందుకు వంశధార, బహుదా నదుల కాలువలను అనుసంధానం చేయాలన్నారు. మత్స్యకారులు మత్స్యసంపదను భద్రపర్చుకోవడానికి కోల్డ్‌స్టోరేజీని నిర్మించాలని కోరారు. కేవలం తరగతి ధ్రువపత్రం లేకపోవడంతో బెంతు ఒరియాలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, ఆ సమస్యను త్వరగా పరిష్కరించాలని విన్నవించారు. కొబ్బరి పరిశ్రమను నిర్మించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్లు పెంచాలని కిడ్నీ బాధితుల తరుపున కోరారు. కిడ్నీ సమస్యతో మృతి చెందిన కుటుంబాలకు రూ.7 లక్షల వరకు ఇన్సూరెన్స్ వర్తింపజేయాలన్నారు. నియోజకవర్గంలో వలసలు ఎక్కువ ఉన్నాయని, అందువల్ల చిన్నతరహా పరిశ్రమలపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను నియమించాలని విన్నవించారు.

సిఎంను కలిసిన ఎమ్మెల్యే

పాతపట్నం: ఇచ్ఛాపురం మండలం ఈదుపురానికి సిఎం చంద్రబాబు ఉచిత గ్యాస్ సిలండర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి దుశ్శాలువ కప్పి సన్మానించారు.

సిఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ఇచ్ఛాపురం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు తీసుకెళ్లారు. శుక్రవారం ఈదుపురంలో ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ ప్రారంభానికి వచ్చిన సిఎంను హెలీప్యాడ్ వద్ద కలిసి

ఇచ్ఛాపురం : సిఎంకు వినతిపత్రం అందజేస్తున్న రాజు

సిఎంను కలిసిన ఎమ్మెల్యే

రణస్థలం రూరల్: జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఇచ్ఛాపురం నియోజకవర్గం ఈదుపురం హెలిపాడ్ వద్ద ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మర్యాదపూర్వక కలిసి స్వాగతం పలికారు.

పింఛను కోసం వేచిచూస్తూ అస్వస్థత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

చికిత్స పొందుతున్న దానమ్మ

పింఛను కోసం ఎదురుచూస్తూ వృద్ధులు అస్వస్థతకు గురైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని మండలం నువ్వలరేవులో బైనపల్లి దానమ్మ వితంతువు పింఛను కోసం ఉదయం ఏడు గంటలకు వేచి ఉంది. ఈ లోపల నామమాత్రంగా పనిచేసిన సర్వర్ ఒక్కసారిగా నిలిచింది. దీంతో పింఛను పంపిణీ మధ్యాహ్నం సమయంలో పంచడానికి అవకాశం కలిగింది. ఇంతలో పింఛను కోసం నిరీక్షించిన దానమ్మ ఒక్కసారిగా అస్వస్థతకు గురై స్పృహతప్పి పడిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హుటాహుటిన పలాసలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు ఆస్పత్రికి వెళ్లి ఆమెకు పింఛను అందజేశారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై సచివా లయం కార్యదర్శి ఉషారాణి మాట్లాడుతూ ఉదయం ఏడు గంటల లోపే ఆమె ఐరిష్ తీసుకోవడానికి అధికారులు వెళ్లారని తెలిపారు. సర్వర్ డౌన్‌కావడంతో మధ్యాహ్నం నుంచి ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేశారని తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పొందూరు : పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పాతపట్నం : పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పలాస : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని తండ్యంవలసలో శుక్రవారం సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా ముందుకు సాగుతుందన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా ప్రజలతో మన్ననలు అందుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని కింతలిలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, మాజీ సర్పంచ్ దవళ గణపతిరావు, వెంకటప్పలనాయుడు, రాజారావు, శ్రీనివాసరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని బుడుమూరు పంచాయతీలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లును విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పుడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, పి.మధుబాబు, ఎంపిడిఒ వెంకటరాజు, తహశీల్దార్ జోగారావు, ఇఒపిఆర్‌డి విశ్వేశ్వరరావు, నాయకులు గోపి, సత్తిరాజు, నల్లి లక్ష్మినాయుడు తదితరులున్నారు.

పాతపట్నం: స్థానిక నీలమణిదుర్గమ్మ కాలనీలో ఎన్‌టిఆర్ పింఛను భరోసా కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని వసుంధరలో ఎన్‌టిఆర్ సామాజిక పింఛనను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలాస వ్యవసాయ శాఖ ఎడి, మండల స్పెషల్ ఆఫీసర్ లింగాల మధుబాబు, ఎంపిడిఒ నరసింహప్రసాద్‌పండా, మాజీ ఎంపిపి సలాన మోహన రావు, కూటమి నాయకులు భాస్కర్‌గౌడ్, సలాన శరత్ కుమార్, నంబాల వెంకటరావు, లలిత కుమారి పాల్గొన్నారు.

పోలాకి : అర్హులందరికీ ఎన్‌టిఆర్ భరోసా పింఛను అందజేస్తున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని జడూరులో పింఛనను పంపిణీ చేశారు. అనంతరం సచివాలయం సిబ్బంది పనితీరును పరిశీలించారు. జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొండు రామన్న, ఎంపిటిసి చైతన్య, మురళి ఎంపిడిఒ రవికుమార్ పాల్గొన్నారు.

పలాస : మండలంలోని ఉల్లాసపేటలో ఎమ్మెల్యే గౌతు శిరీష పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, దడియాల నర్సింహులు, అంబటి కృష్ణమూర్తి, బి.నాగరాజు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

లావేరు : పింఛన్లు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

పోలాకి : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పైడమ్మ (ఫైల్)

మండలంలోని కుప్పిలిలో వాహనం ఢీకొని పైడమ్మ (58) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పైడమ్మ గురువారం దీపావళి సందర్భంగా ఇంట్లో పనులు చేస్తూ... తాగునీటి క్యాన్ కోసం బయటికి వెళ్లింది. అటు నుంచి వచ్చిన వ్యాన్ బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృత్యువాత పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతురాలి భర్త పాపారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సందీప్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా : విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

గాయపడిన విద్యార్థిని

మెళియాపుట్టి సమీపంలో శుక్రవారం విద్యార్థులతో ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడి పలువురు విద్యార్థులు గాయపడ్డారు. మండలంలోని జలకలింగుపురం నుంచి ఆటోపై మెళియాపుట్టికి ట్యూషన్‌కు వస్తున్నారు. ఆటో వెనుక భాగం నుంచి మరో ఆటో ఢీకొంది. దీంతో ముందు వెళ్తున్న ఆటో బోల్తా పడడంతో పవన్ సాయి, నాగచైతన్య, బాలకృష్ణ, తనుశ్రీ, మేఘనా, హేమలత, విష్ణు ప్రియలు స్వల్ప గాయాలకు గురయ్యారు. వీరిని వైద్యం నిమిత్తం టెక్కలి ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. సంఘటనపై ఎస్ఐ నర్సింగరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

సచివాలయంలో చోరీ

పాతపట్నం : మండలంలోని కొరసవాడ గ్రామ సచివాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. బీరువా తాళాలు విరగొట్టి విలువైన పత్రాలు, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ సంబంధిత పరికరాలను ఎత్తుకెళ్లారు. శుక్రవారం విధుల్లోకి వచ్చిన సచివాలయ సిబ్బంది ఈ విషయం గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు వెళ్లి పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సరుబుజ్జిలి : కాలిబూడిదైన పూరిల్లు

పాతపాడులో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని తెలికిపెంట పంచాయతీ పరిధిలోని పాతపాడులో నివగాన ముఖలింగంకు చెందిన పూరిల్లు గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యింది. ఈ ప్రమాదంలో ఇంటిలో ఉన్న బట్టలు, ధాన్యం, సామాగ్రితో పాటు మొత్తం కాలి బూడిదైనట్టు బాధితులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో...

లావేరు: మండలంలోని గుర్రలాపాలెంలో దళిత వాడకు చెందిన నేతల పెంటయ్యకు చెందిన పూరిల్లు శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి కాలిబూడిదైంది. ఇంటిలో ఉన్న సామాగ్రి, విద్యుత్ మీటరు, టివి, రేషన్‌కార్డు, బ్యాంకు పుస్తకాలు, తిండి గింజలు, రూ.25వేలు నగదు కాలిబూడిదయ్యాయి. అలాగే పెంటయ్య కుమారుడు పదోతరగతి మార్కుల ధ్రువపత్రం, బట్టలు బూడిదయ్యాయి. సుమారు రూ.లక్ష ఆస్థి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

అభినందిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు

హాకీ పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో జరగబోవు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ హాకీ పోటీలకు శ్రీకాకుళం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల గిరిజన విద్యార్థులు సవర జయకృష్ణ, సవర చందు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు డి.శ్రీ నివాసరావు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ ఎం.వాసుదేవ ఆచారి, సీతంపేట గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు అన్నదొర శుక్రవారం అభినందించారు. అనంతరం క్రీడాకారులు పయనమయ్యారు.

సిసిడబ్ల్యుఎస్ సంస్థ ఎమ్‌డిగా బొడ్డపాడు వాసి

ప్రజాశక్తి- పలాస

అండమాన్‌లోని సిసిడబ్ల్యుఎస్ సంస్థ ఎమ్‌డిగా మండలంలోని బొడ్డపాడుకు చెందిన బొడ్డు రామారావు ఉద్యోగోన్నతి పొంది శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బొడ్డపాడు జగదీశ్వర సంఘం సభ్యులుగా ఉన్న బొడ్డు రామారావుకు బొడ్డపాడు గ్రామ ప్రతినిధులు, తెలుగు యువత అధ్యక్షుడు కిక్కిరి ఢిల్లీరావు ఆయనకి అభినందనలు తెలిపారు. రామారావు 1989లో సిసిడబ్ల్యుఎస్ సంస్థలో చేరారు. ఆ ప్రయాణంలో అనేకమైన వడదడుకుల్లో మధ్య వచ్చిన వ్యక్తి. సునామీ సమయంలో సర్వస్వం కోల్పోయినా సరే పట్టువిడకుండా డిపార్ట్‌మెంట్ అభివృద్ధికి కృషి చేశారు. ఈ సంస్థలో 35 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఇంకా ఆరేళ్ల ఈ సంస్థలో ఎండీగా ఉండి సేవలందిస్తూ... బొడ్డపాడుకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వీరు కోరారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

పొందూరు: మండలం కింతలి గ్రామానికి చెందిన సీపాన పవన్‌కుమార్, సాయిలక్ష్మి దంపతులకు రూ.నాలుగు లక్షలు సిఎం సహాయనిధి చెక్కును గురువారం ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆయన స్వగృహంలో అందజేశారు. వీరి కుమారుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తుండడంతో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సిఎం రిలీఫ్ పండ్ మంజూరు చేయించారు. కార్యక్రమంలో ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, మాజీ సర్పంచ్ దవళ గణపతిరావు, కూటికుప్పల వెంకటప్పల నాయుడు, శ్రీనివాసరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించాలి

ప్రజాశక్తి- పోలాకి

గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించి సకాలంలో వైద్య చికిత్స అందించాలని ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ టి.శ్రీకాంత్ ఆదేశించారు. మండలంలోని దీర్ఘాసిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ వైద్య శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి ఆరా తీశారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ నుంచి మూడు పర్యాయాల సందర్శన కాలంలో రక్త పరీక్ష ద్వారా రక్తహీనతను గుర్తించాలని సూచించారు. క్షయ, కుష్టు రోగులకు సకాలంలో మందులు అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్, డాక్టర్ శ్రీనాథ్, ఎఎన్ఎం కమల, పరమహంస పాల్గొన్నారు.

ఆనంద దీపావళి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సమైక్యంగా జరుపుకునే పండగే దీపావళిని, కార్యకర్తలు, ప్రజల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ కార్యాలయలో నియోజకవర్గ కార్యకర్తలు, ప్రజలతో కలిసి గురువారం ఘనంగా దీపావళి జరుపుకున్నారు. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి దీపావళియని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, టిడిపి నాయకులు కర్రి అప్పారావు పాల్గొన్నారు.

పలాస : ఎమ్మెల్యే గౌతు శిరీష స్వగృహంలో గురువారం రాత్రి దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీపావళి వేడుకల్లో మాజీ మంత్రి గౌతు శివాజీ, భార్య విజయలక్ష్మి, ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఉత్సాహంగా... ఉల్లాసంగా గడిపారు.

పొలం గట్లపై కూరగాయల సాగు

కషాయం చేస్తున్న రైతులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులచే వరి పొలం గట్లపై బహుళ పంటల కూరగాయల సాగును చేపట్టారు. ఈ సందర్భంగా డిజిటల్ యల్.టు సురేష్ మాట్లాడుతూ పొలం గట్లపై ఎ-గ్రేడ్ మోడల్ పద్ధతిలో కూరగాయలను సాగు చేయడం వలన రైతులకు ఇంటి అవసరాలకు సరిపడా కాయగూరలతో పాటు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులకు అదనపు ఆదాయాన్ని చేకూర్చుకునే విధంగా పలు రకాల మోడల్స్ పద్ధతిని తెలియజేస్తూ క్షేత్రస్థాయిలో పని చేయిస్తున్నామని యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు తెలిపారు. కార్యక్రమంలో రైతులు రాము, బాలకృష్ణ, హరికృష్ణ, తేజేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో తెగుళ్ల నివారణ

కవిటి : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మెడ విరుపు తెగులు, అగ్గి తెగులు నివారణకు మారేడు కాషాయం పిచికారీ చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని యూనిట్ ఇన్‌ఛార్జి తులసయ్య తెలిపారు. మండలంలోని శిలగాం పంచాయతీ జమేదారుపుట్టుగలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరిలో వచ్చే మెడవిరుపు తెగులు, అగ్గి తెగుల నివారణకి అద్భుతంగా పనిచేసే మారేడు కాషాయం రైతులతో తయారీ చేయించారు.

ఆమదాలవలస : సాగు చేసిన కూరగాయలతో రైతులు

అనంతరం మాట్లాడుతూ మారేడు కాషాయంలో ఎన్నో రకాల రసాయనాలు, ఆల్కలాయిడ్ వల్ల ఇది తెగుళ్ల నియంత్రణలో ఉపయోగపడుతుందన్నారు. దీనికోసం ఐదు కేజీల మారేడు ఆకులు పది లీటర్ల నీటిలో వేసుకుని అవి ఐదు లీటర్లు వచ్చే వరకు ఉడకబెట్టాలని సూచించారు. ఆ తరువాత అవి చల్లారాక వంద గ్రాముల సబ్బుపొడిని కలుపుకొని వంద లీటర్ల నీటిలో వేసుకొని పంట కాలంలో వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. దీనిద్వారా పంటను ఆశించే తెగుళ్లు మాయమై మంచి దిగుబడి వస్తుందని తెలిపారు.

సమావేశమైన ఎపిటిఎఫ్ సభ్యులు

రఘువర్మను గెలిపించాలి

ఆమదాలవలస : ఎపిటిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మ గెలుపునకు అందరం సమిష్టిగా కలిసి కృషి చేద్దామని ఎపిటిఎఫ్ కార్యవర్గ సభ్యులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎపిటిఎఫ్ జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రఘువర్మ గెలుపునకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. సమావేశంలో పి.అప్పలనాయుడు, బి.చంద్రశేఖర్, సీనియర్ నాయకులు హెచ్.వి.సత్యనారాయణ, టి. సూర్యనారాయణ, బి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఆమదాల వలస, బూర్జ, సరుబుజ్జిలి మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

పలాస: మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో చదువుతున్న విద్యార్థులు శుక్రవారం రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న యాచకులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చిన డబ్బులను దాటుకుంటూ ప్రతినెలా 1న యాచికులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో సత్యసాయి విద్యావిహార్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాలను అందజేస్తున్న విద్యార్థులు

నామినేటెడ్ పోస్టులపై దృష్టి

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గంలో రెండు దశాబ్దాల అనంతరం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తల కృషి, కష్టం ఉందని అధిష్టానం గుర్తించినట్లు సమాచారం. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చంద్రబాబు నాయుడు పాతపట్నం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలుస్తోంది. మొదటి నుంచీ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇప్పించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నట్లు సమాచారం. పాతపట్నం నుంచి పైలా బాబ్జీ, సలాన మోహనరావు, మంచు కృష్ణారావు, కొత్తూరు నుంచి భైరాగినాయుడు, ఎల్ఎన్‌పేట మండలం నుంచి శివాల కిషోర్, హిరమండలం నుంచి ఒ.ఆనందరావు, పొగిరి చిట్టిబాబు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే వచ్చే పంచాయతీ ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో సర్పంచ్‌లను కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతో వ్యూహం రచించినట్లు భోగట్టా. ఈ నేపథ్యంలోనే పాతపట్నం మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా రేసులో నల్లి సుజాత పేరును చంద్రబాబు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈమె భర్త నల్లి రాజారావు మాష్టారుకు మంచి పేరుంది. ఈ కుటుంబ సభ్యులకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అండదండలు పుష్కలంగా ఉన్నాయి. అలాగే ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్సీ కూడా అవకాశం ఉందని తెలుస్తోంది.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

నివాళ్లర్పిస్తున్న కుమార్ రాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు కొనియాడారు. శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దితనోత్సవాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ డివివిజిఎస్ శంకరరావు, విశ్రాంత ఉద్యోగులు గోవిందరావు, శ్రీరాములు, సిబ్బంది ప్రత్యూష, రామ్మోహన్ పాల్గొన్నారు.

నగరంలోని గాంధీ మందిరం ఆవరణలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి అధ్యక్షులు తమ్మిన భాస్కరరావు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో మండవిల్లి స్వామి, శ్రీనివాస్ గుప్త, కాపుగంటి సంతోష్, నరసింహం, మాటూరు దీపక్, పి. వెంకట రమణమూర్తి, శంబాన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక స్వర్ణభారతి విద్యాసంస్థల్లో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగ నిర్వహించారు. స్వర్ణభారతి విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు త్యాగాలను, దేశభక్తిని వివరించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ చాట్ల నీలిమరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే శాంతి నికేతన్ విద్యా సంస్థల్లో చైర్మన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యాన రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు నిర్వహించారు.

నగరంలో నిత్యన్నదానం

శ్రీకాకుళం అర్బన్: నగరంలో అయ్యప్ప యాత్రికులకు 41 రోజుల పాటు బలగ వద్ద గురు రాఘవేంద్ర స్వామి ఆలయంలో అందిస్తున్న ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని టిడిపి నాయకులు గొండు స్వాతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎదుటివారిని గౌరవించడం, పేదలకు సాయపడటం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు చైర్మన్ బరాటం చక్రవర్తి, నాయకులు గౌరీ శంకర్ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న సభ్యులు

ఇతరులకు ప్రేరణగా నిలవాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వైద్య విద్య అభ్యాసనలో తామాడ శృతి ఇతరులకు ప్రేరణగా నిలుస్తూ భవిష్యత్‌లో ఉత్తమ వైద్యురాలుగా మంచి గుర్తింపు పొందాలని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు తమాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కొమరల్తాడ పంచాయతీ తామాడ పేటకు చెందిన తమాడ శృతి వైద్య వృత్తి విద్య కోర్సులో తొలి ప్రయత్నంలో రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశం పొందింది. ఈ నేపథ్యంలో శుక్రవారం శృతితో పాటు ఆమె తల్లిదండ్రులు మోహిని, కృష్ణారావులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు మండల మహేష్, గొండి రవి, చింత శ్రీను, చింత పవన్ కుమార్, పవన్‌కుమార్, బమ్మిడి నవీన్, రత్నాల అనిల్, కొంకి మోహిని, అంగ సీత, బి.ఊర్వశి, తామాడ మీన పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి- పలాస

పలాసకు చెందిన జీడి కార్మికురాలు కవిత పాత్రోకు క్యాజూ లేబర్ యూనియన్, రైస్ మిల్లర్ యూనియన్ నాయకులు రూ.20 వేలు ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు. కవిత పాత్రో భర్త దామోదర పాత్రో ఇటీవల అనారోగ్యానికి గురై శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధి కావడంతో మెరుగైన చికిత్స అందించేందుకు రూ.1.50 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో దీంతో దాతల కోసం ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న యూనియన్ నాయకులు ఆర్థికసాయం అందించారు.

ఆర్థికసాయం అందజేస్తున్న యూనియన్ నాయకులు